క్లుప్తంగా

కొనసాగుతున్న శివలింగాల ప్రతిష్ఠాపన


శివలింగం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న రమణానంద మహర్షి, భక్తులు

భువనగిరి రూరల్ : మండలంలోని నాగిరెడ్డిపల్లిలోని రమణేశ్వరంలో సిద్ధగురువు రామణానంద మహర్షి ఆధ్వర్యంలో చేపట్టిన శివలింగాల ప్రతిష్ఠాపన పూజలు మంగళవారం కొనసాగాయి. తాంత్రిక సిద్ధగురువుల పేరుతో 29 శివలింగాల ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం కాలభైరవ హోమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన అయిలయ్య


పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట: ఆలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన బీర్ల అయిలయ్య మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ ఎల్లాలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ కేటాయించి గెలుపునకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే సాంబశివరావును కలిసిన నాయకులు

ఆత్మకూరు(ఎం): కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందిన కూనంనేని సాంబశివరావును మంగళవారం ఆత్మకూరు(ఎం) మండలానికి చెందిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాశికంటి లక్ష్మీనర్సయ్య, సీపీఐ మండల కార్యదర్శి జల్లి రాములు హైద్రాబాద్‌లోని ముగ్దుం భవన్‌లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సాంబశివరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

వలిగొండ : మండలంలోని సుంకిశాలలో ప్రవాస భారతీయులు పైళ్ల మల్లారెడ్డి సాధన సహకారంతో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

వంగాల బాలనర్సయ్యకు ఘన నివాళి


బాలనర్సయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, నాయకులు

వలిగొండ : మండలంలోని నెమిలకాల్వకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ది వంగాల బాలనర్సయ్య వర్ధంతిని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన విగ్రహానికి పలువురు నివాళులర్పించా రు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి వంగాల ఈశ్వరయ్య, వంగాల వాసుదేవ్, వంగాల వెంకన్న,పైళ్ల రాజవర్దన్ రెడ్డి,గూడూరు శివశౌత్ రెడ్డి,పబ్బు ఉపేందర్ బోస్,కాసుల కృష్ణ, వంగాల రోహిత్, బిక్షపతి, మల్లేశం, రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కారోబార్ పెండెం సత్యపాల్ మృతి

ఆత్మకూరు(ఎం): మండలంలోని కొరటికల్‌లో గ్రామ పంచాయతీ కారోబార్ పెండెం సత్యపాల్(56) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. సత్యపాల్ సోమవారం అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్యపాల్ పలువురు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, సర్పంచ్ కోల సత్తయ్య, ఉప సర్పంచ్ చీరబోయిన స్వామి, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు నోముల నర్సిరెడ్డి, వెలిమినేటి జహంగీర్, ఎలిమినేటి నాగేష్, వెంకన్న, జర్నలిస్టులు ఎలిమినేటి నర్సింహ, బీవీఎల్ఎన్ చారి, రేగోటి పాండురంగం, యాస గోవర్ధన్‌రెడ్డి, వెంకన్న, అరుణ, గాడిపెల్లి ఉదయ్‌కుమార్ పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూరు(ఎం): మండలంలోని కూరెళ్లలో మేకల లలిత మృతి చెందింది. గ్రామ సర్పంచ్ భాషబోయిన ఉప్పలయ్య యాదవ్ మంగళవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్కల స్వామి, రైతు సమితి కో ఆర్డినేటర్ కొత్తోజు యశ్వంత్‌కుమార్, నాయకులు గద్దం అశోక్, నిమ్మనగోటి గణేష్, శంకరయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న యాసంగి సాగు

- పొలం పనుల్లో రైతులు బిజీబిజీ
- 27వేల ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారుల అంచనా
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు


ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు


నాటు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరినారు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని మూసీ పరివాహక గ్రామాల్లో యాసంగిసాగు ఊపందుకుంది. ఆయా గ్రామాల్లో రైతులు 15రోజుల క్రితమే మడులు సిద్ధం చేసి నార్లు పోశారు. ప్రస్తుతం వరినారు ఏపుగా పెరిగింది. మరో వారం రోజుల్లో నాట్లు వేయనున్నారు. ఇప్పటికే రైతులు ట్రాక్టర్లతో దుక్కులు దున్నిస్తూ, కంపోస్ట్ ఎరువులను చల్లుతూ నాట్లు వేయడానికి పంట పొలాలను సిద్ధం చేసుకుంటూ రైతులు సాగు పనుల్లో బీజిబిజీగా ఉన్నారు.

27వేల ఎకరాలలో వరి..

ఈ యాసంగిలో మండల వ్యాప్తంగా 27 వేల ఎకరాలలో వరిసాగు అవుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అందుకనుగుణంగా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. సాగు ప్రణాళిక అనుగుణంగా వ్యవసాయాధికారులు పీఏసీఎస్‌లు, మన గ్రోమోర్, లైసెన్స్‌డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారు. 180 మెట్రిక్ టన్నుల యూరియా, 120 మెట్రిక్ టన్నుల డీఏపీ, 220 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, జింక్ సల్ఫేట్ అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. మండలంలో సాగునీటి వనరులు సమృద్ధిగా ఉడడం మూసీ నది, పిలాయిపల్లి కాలువ, చెరువులు, కుంటలు, వ్యవసాయ బోర్లపై ఆధారపడి రైతులు వరిసాగు చేస్తుండడంతో ప్రతి ఏటా వరిసాగు గణనీయంగా పెరుగుతూ వస్తుంది. గత మూడేళ్లలో వరిసాగు 18 వేల నుంచి 27వేల ఎకరాల వరకు పెరగడం గమనార్హం.

యాసంగిలో జింక్ లోపం..

ఈ యాసంగిలో వరిపంటకు సాధారణంగా జింక్ లోపం ఏర్పడుతుంది. జింక్ లోపం వల్ల వరి మొక్క ఆకులు ఎర్రబారి క్రమంగా ఎండిపోతాయి. దీంతో పంట దిగుబడి తగ్గిపోతుంది. ఇక చలి తీవ్రత వరినారు పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. దీని నివారణకు రోజు ఉదయం, సాయంత్రం మరినారు మడుల్లో నీరు మార్చాలని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. అలాగే జింక్‌లోప నివారణకు 20 గ్రామల చిలామిన్ జింక్, లేదా జింక్ సల్ఫేట్‌తో పాటు 20 గ్రాముల యూరియాను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని.. ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మొదటి దుక్కులో గాని, లేదా చివరి దుక్కులో గాని పిచికారీ చేసుకోవాలని సూచిస్తున్నారు.

ఎరువులు అందుబాటులో ఉన్నాయి



వారం రోజులుగా చలితీవ్రత పెరిగింది. చలితీవ్రత వరినారు పెరుగుదలపై ప్రభావం చూపిస్తుంది. దీని నివారణకు ప్రతిరోజు నారుమడిలోని నీటిని మార్చాలి. అలాగే యాసంగిలో జింక్ లోపం కన్పిస్తుంది. తప్పనిసరిగా చిలావిఎస్ జింక్, యూరియా కలిపి వేసుకోవాలి. ప్రస్తుతం వరి నారుదశలో ఉంది. అన్ని సొసైటీలు, డీలర్ల వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వరిసాగులో రైతులు తప్పనిసరిగా వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

– ఏజాజ్ అలీఖాన్, మండల వ్యవసాయాధికారి, భూదాన్‌పోచంపల్లి

విద్యార్థులను ప్రోత్సహించేందుకే స్కాలర్‌షిప్‌లు


చెక్కులు అందజేస్తున్న దివీస్ జనరల్ మేనేజర్లు

చౌటుప్పల్ : ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకే దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని దివీస్ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్, బాలకిశోర్ తెలిపారు. మంగళవారం లింగోజిగూడెం గ్రామంలోని పరిశ్రమ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 57మంది విద్యార్థులకు 9లక్షల 2వేల 840 రూపాయల స్కాలర్‌షిప్‌ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. విద్యారంగం అభివృద్ధికి పరిశ్రమ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంతంగి సర్పంచ్ బాతరాజు సత్య, దివీస్ అధికారులు సీహెచ్.వీరయ్య, శివప్రసాద్, వల్లూరి వెంకటరాజు, బి.గోపి, జి.వెంకటేశ్వర్లు, ఎస్.సాయికృష్ణ, వి.వంశీకృష్ణ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుకృత్‌కుమార్

ఆలేరురూరల్ : రైతులు పంట మార్పిడి పద్ధతి పాటిస్తూ భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ మృత్తిక శాస్త్రవేత్త సుకృత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆలేరు మండలం శారాజీపేట గ్రామంలో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్టె ఆకుల ఎరువులను వాడాలని సూచించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని క్రమక్రమంగా పెంచుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచనలు చేశారు. సాగులో వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ అధిక దిగుబడుతు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండ పద్మపర్వతాలు, వ్యవసాయ అధికారి దీప్తి, ఏఈఓలు నాగార్జున, కళ్యాణ్, రైతులు హమీద్‌బాబు, కంతి కిష్టయ్య, రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ తాండ్ర అమరావతి

గుండాల : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ తాండ్ర అమరావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. వెల్మజాల గ్రామ చెరువుకు అలుగు నిర్మాణం చేపట్టాలని, పాఠశాలలో నిలిచి పోయిన మన ఊరు – మన బడి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ సంగి బాలకృష్ణ కోరారు. పాచిల్ల గ్రామం నుంచి బండకొత్తపల్లి మీదుగా సూర్యాపేట, జనగామ హైవే రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించాలని కోరారు. వెటర్నరీ ఆధ్వర్యంలో రైతులకు 50 శాతం సబ్సిడీపై గడ్డి కోత యంత్రాలు ఉన్నట్లు డాక్టర్ ప్రత్యూష తెలిపారు. గ్రామ పంచాయతీల ట్రాక్టర్లను సర్పంచ్‌లు తక్షణమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీఓ జనార్ధన్‌రెడ్డి కోరారు. మండలంలో 167 ఎకరాలలో ఆయిల్‌పామ్ చేపట్టామని ఉద్యాన శాఖ అధికారి నసీమా తెలిపారు. ఈ సమావేశంలో మండల కోఆప్షన్ ఎండీ.షర్ఫోద్దీన్, ఎంపీటీసీలు మహేష్, సుశీల, ఎంపీడీఓ జి.శ్రీనివాసులు, ఏఓ లావణ్య, పీఆర్ఏఈ దామోదర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, డాక్టర్ యాకూబ్, సీహెచ్ఓ భాషయ్య తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబరాలు

భూదాన్‌పోచంపల్లి : తెలంగాణ సీఎంగా రేవంత్ రెడ్డిని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి పట్టణ కేంద్రంలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ యూత్ అధ్యక్షుడు సీత సుధాకర్, ప్రధానకార్యదర్శి జింకల జయసూర్య, కుక్క అరుణ్, నవీన్, మహేష్, కుక్క వంశీ, మైల జంగయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎంగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంపై హర్షం

ఆత్మకూరు(ఎం): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. హర్షం వ్యక్తం చేసినవారిలో ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, జిల్లాలశేఖరెడ్డి, సర్పంచ్ నాగేష్, ఉప సర్పంచ్ నవ్య, అనంతరెడ్డి, మల్లేశం గౌడ్, మహేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సభ్యులు సమావేశంలో చర్చించి పలు తీర్మానాలు చేశారు. సర్పంచ్‌లను, వ్యవస్థను పూర్తిగా దిగజార్చిన 2018– పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించాలని పంతంగి సర్పంచ్ బాతరాజు సత్యం డిమాండ్ చేశారు. గ్రామ అవసరాలకు నిధులు ఖర్చు చేయలేని దుస్థితి నెలకొందన్నారు. చట్టాన్ని పూర్తిగా సవరించాకే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎలాంటి అక్రమాలు జరగకున్నా అధికారులు అప్పటి ఎమ్మెల్యే మెప్పు కోసం తనను వేధించారని పెద్దకొండూర్ సర్పంచ్ కాయితి రమేష్‌గౌడ్ వాపోయారు. పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీల ట్రాక్టర్‌ల నిర్వహణ బిల్లులు తక్షణమే చెల్లించాలని సర్పంచ్‌లు కొర్పూరి సైదులు, చౌట వేణుగోపాల్, బచ్చ రామకృష్ణలు డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం నుంచి పీపల్‌పహాడ్ మీదుగా అల్లాపురం వరకు ఉన్న రోడ్డును రెండు వరుసలుగా విస్తరించాలని సర్పంచ్ కొలను శ్రీనివాస్‌రెడ్డి కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి పెత్తనమంతా ఎమ్మెల్యేలకే అప్పగించిందన్నారు. ఈ నెలాఖరు లోపు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సందీప్‌కుమార్, వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, ఎంపీఓ నర్సింహ రావు, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు , ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు.

నేడు మండలస్థాయి చెస్ పోటీలు


బొమ్మలరామారం : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణ

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మండల స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండల స్థాయి చెస్ పోటీల్లో 14 –17 సంవత్సరాల వయస్సుగ బాలురు, బాలికలు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల ఇన్‌చార్జ్ బాల్ నర్సింహ, పాండు నాయక్, కృష్ణారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అంబటి శోభరాణి, సిల్వేరు మహేష్, పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 14 నుంచి 17 సంవత్సరాలలోపు విద్యార్థులు పాల్గొనాలన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులు పాఠశాల నుంచి బోనాఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. ప్రతి పాఠశాలకు ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మండల పాఠశాల క్రీడల కార్యదర్శి గంజి చండీదాస్ (9948640071)ను సంప్రదించాలన్నారు.

మొక్కులు తీర్చుకున్న నాయకులు


భూదాన్‌పోచంపల్లి : పూజలు నిర్వహిస్తున్న కుంభం అనిల్ కుమార్ రెడ్డి అభిమానులు

భూదాన్‌పోచంపల్లి : భువనగిరి ఎమ్మెల్యేగా కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన మీసాల శంకర్, లలిత, నితిన్, సాయికిరణ్, సంజయ్‌లు మంగళవారం స్థానిక రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నలచ్చి లింగస్వామి, మీసాల యాదయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు పగడాల నర్సింహ, ఉపాధ్యక్షుడు మీసాల కృష్ణ, చొక్కా రెడ్డి, మీసాల సుధాకర్, శంకర్, రఘు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): ఆలేరు ఎమ్మెల్యేగా బీర్ల అయిలయ్య విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మండలంలోని పల్లెర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ దుర్గామాత ఆలయంలో పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సోలిపురం నర్సింహరెడ్డి, ముద్దసాని వెంకన్న, లోడి రాజు, గర్షకోట నవీన్, తండ గోపి, బొంగు లింగయ్య, లోడి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న కాంగ్రెస్ శ్రేణులు

వలిగొండ : భువనగిరి ఎమ్మెల్యేగా కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఘన విజయం సాధించడంతో పలువురు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు మంగళవారం హైదరాబాద్ జూబిలీహిల్స్ పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బోళ్ల శ్రీనివాస్ , కంకల కిష్టయ్య,బతిని లింగయ్య,కొండూరు సాయి,కాసుల వెంకన్న, కొండూరు భాస్కర్, మైసోల్ల ప్రవీణ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు

భువనగిరిరూరల్ : హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై, బొల్లేపల్లి గ్రామంలో మంగళవారం రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో బొల్లేపల్లి గ్రామంలోని మూలమలుపులతో పాటు బీబీనగర్ వద్ద, నాగిరెడ్డిపల్లి వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

మోత్కూరు : మండలం పాటిమట్ల గ్రామంలో రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 మంది కల్లు గీత కార్మికులకు దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గీత కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు రాజమాత ఫౌండేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు రాచకొండ కనకయ్య, రాచకొండ మల్లయ్య, మొగులగాని వెంకటేష్, తీగల రాజు, రాగటి నర్సయ్య, లోడె లింగయ్య, గనగాని యాదగిరి, కమ్మంపాటి వెంకన్న, రాచకొండ స్వామి, రాచకొండ మల్లేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో నీటి కష్టాలు

- కాలనీలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్
- మూడు రోజులకోసారి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు


ఇందిరమ్మకాలనీ వ్యూ


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

భువనగిరిటౌన్ : భువనగిరి పట్టణం దినదినాభివృద్ధి చెందుతుంది. దీనికి అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులు అభివృద్ధి చెందుతున్నాయి. కానీ పట్టణ శివారులో ఉన్న హుసెనాబాద్, బస్వాపురం గ్రామాలకు మధ్యన ఉన్న ఇందిరామ్మకాలనీలో మాత్రం తాగు నీటికి ఇబ్బందులు తప్పడం లేదు. నేటికి ట్యాంకర్ల ద్వారా ప్రతి ఇంటికి మూడు డ్రమ్ముల చొప్పున మూడు రోజులకు ఒకసారి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న ఒక డ్రమ్ము రూ. 10 చొప్పున మూడు డ్రమ్ములకు రూ.30లు వసూలు చేస్తున్నారని పలువురు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. శుభకార్యాలు, పండుగలు జరిగినప్పుడు నీటి కోసం ఇబ్బందులు తప్పవని ప్రత్యేక ట్యాంకర్లతో నీటిని తెప్పించుకోవాల్సిన పరిస్థితి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. ట్యాంకర్లతో పంపిణీ చేసిన నీరు సైతం సరిగ్గా ఉండకపోవడంతో ఎలర్జీ, వివిధ రకాల చర్మ సమస్యలు వస్తున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా ట్యాంక్

ఇందిరమ్మ కాలనీలో మంచినీటి నీటి సరఫరా కోసం రెండు సంవత్సరాలు క్రితం ట్యాంకు నిర్మించి కొన్ని ఇళ్లకు మాత్రమే నల్లా కనెక్షన్ ఇచ్చారు. మిగితా చోట్ల పైపులైన్ వేయలేదు. కనీసం ఇచ్చిన నల్లా కనెక్షన్లకు కూడా నీటిని సరఫరా చేయడం లేదు. దీంతో వాటర్ ట్యాంక్ నిరుయోగంగా ఉంటుంది. కాలనీలో నీటి సమస్య ఉందని ప్రజా ప్రతినిధులు, అధికారులకు విన్నవించిన ఎవరూ పట్టించుకపోవడం లేదని పలువురు వాపోతున్నారు.

కాలనీలో నీటి సమస్యను పరిష్కరిస్తాం

కాలనీ మంచి నీటి సరఫరా కోసం ట్రియిల్ రన్ చేయడం జరిగింది. మంచి నిరు తక్కువ వస్తుడడంతో ట్యాంక్ వద్ద బోరు వేశాం. పది రోజుల్లో మంచి నీరు సరఫరా అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ప్రతి ఇంటికి మంచి నీటిని సరఫరా చేస్తాం.

– భట్టు నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

మునుగోడు: విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నల్లగొండ ఏఎంఓ(అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్) రామచందర్‌నాయక్ సూచించారు. మంగళవారం మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మునుగోడు, పలివెల, కొంపల్లి కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమం ద్వారా విద్యార్థులకు గుణాత్మక విద్య బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కత్తుల రవీందర్, కొంపల్లి, పలివెల పాఠశాలల హెచ్.ఎంలు లెంకల శ్రీనివాస్ రెడ్డి, ఎండీ రఫీ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో వానరాలు

- జనావాసాల్లో కోతుల బీభత్సం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కోతుల బెడదను నివారించాలని ప్రజల వేడుకోలు


రాజాపేటలో రోడ్లపై సంచరిస్తున్న కోతులు

రాజాపేట : అరణ్యాల్లో ఉండాల్సిన వానరాలు జనావాసాల్లో గుంపులు గుంపులు సంచరిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజాపేట, రఘునాథపురం, నర్సాపురం రేణికుంట, కుర్రారం, నెమిల, బూర్గుపల్లి, పారుపల్లి తదితర గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి వంట పాత్రలు, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్తున్నాయి. పిల్లలను, మహిళలను గాయపరుస్తున్నాయి. కోతులకు భయపడి ఇళ్ల వద్ద గృహి ణులు ఒంటరిగా ఉండాలంటే భయపడుతున్నారు. ఇంటి తలుపులు తీసి ఉంచితే ఇక అంతే సంగతులు. ఇంట్లో ఉన్న సరుకులు మాయంకాక తప్పడం లేదు. నిత్యం జనావాసాల్లో వానర సైన్యం స్వైర విహారం చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో, పెరట్లో పెంచుకునే పండ్ల, పూల మొక్కలను నాశనం చేస్తున్నాయి. ఇంటిపై ఉన్న కేబుల్ వైర్లు కూడా తెంపేస్తున్నాయి. తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయలు విక్రయించే చిరువ్యాపారుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. ఇళ్లలో పెంచుకున్న పండ్లు, కూరగాయల మొక్కలను పీకేస్తుండం.. ఇళ్లలో ఉన్న వారిపై దాడిచేస్తూ గాయపరుస్తున్నాయి. కోతుల నివారణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పంట పొలాలపై ..

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను వానర సైన్యం నుంచి కాపాడుకునేందుకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వ్యవసాయ బావుల వద్ద సైతం కోతుల బెడద తీవ్రంగా ఉందని సాగుచేసిన పంటలపై కోతుల గుంపు దాడి చేసి నష్టపరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పప్పు దినుసులు, కూరగాయలు సాగు చేసే రైతులు కోతుల కారణంగా ఆ పంటలూ సాగుచేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో ఎన్నోసార్లు అటవీశాఖ అధికారులకు తెలిపి పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని కోతులను పట్టించి అటవీ ప్రాంతాలకు తరలించాలని వేడుకుంటున్నారు.

కోతుల బెడద నివారించాలి



కోతులు గ్రామాల్లోని వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. బయటకు ఒంటరిగా వెళ్తే దాడిచేసి గాయపరుస్తూ చేతికి దొరికిందల్లా ఎత్తుకెళ్లి పోతున్నాయి. కోతుల భయంతో బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కోతులను పట్టించి అడవుల్లో వదిలేయాలని కోరుతున్నాం.

– భైర లక్ష్మి, బేగంపేట

పంటలను ధ్వంసం చేస్తున్నాయి



కోతులు వ్యవసాయ పంట పొలాలపై గుంపులు గుంపులుగా దాడులు చేసి చేతికొచ్చిన పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కూరగాయలు, చిరుధాన్యాలు పండించలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి గ్రామాల్లో కోతుల బెడదను నివారించి పంటలను కాపాడాలని కోరుతున్నాం.

– బాలయ్య, రాజాపేట

ఘనంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం

భువనగిరి : పట్టణ శివారులోని శ్రీ రేణుకాఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం మాజీ ఎంపీపీ తోటకూరి వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి వడి బియ్యం పోశారు.

వణికిస్తున్న చలిగాలులు

రామన్నపేట : మిచాంగ్ తుఫాను ప్రభావంతో మంగళవారం మండలవ్యాప్తంగా చలిగాలితో కూడిన వర్షం కురిసింది. చలిగాలులతో జనం గజగజ వణికిపోయారు. చలిలో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. జనం ఇళ్లనుంచి బయటకు రాకపోవడంతో రోడ్లన్నీ బోసిపోయాయి.